రోడ్డెక్కిన పల్లి రైతు

- పంటకు మద్దతు ధర చెల్లించాలని ఆందోళన
- కమీషన్ 5 శాతం కట్ చేస్తున్నారని ఆరోపణ
- వ్యాపారులు, అధికారులు కలిసి ముంచుతున్నారని ఆవేదన
- రెండు గంటలపాటు జాతీయ రహదారిపై బైఠాయింపు

శనివారం పరిగిలో రోడ్డుపై నుంచి రైతులను పక్కకు నెట్టేస్తున్న పోలీసులు

పరిగి, జనవరి 27: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ పల్లి రైతులు ఆందోళనకు దిగారు. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్కువ ధర చెల్లిస్తూ.. కమీషన్ పేరిట 5 శాతం కట్ చేస్తున్నారని ఆరోపించారు. మద్దతు ధర చెల్లించి పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం వికారాబాద్ జిల్లా పరిగిలోని జాతీయ రహదారిపై రెండుగంటల పాటు బైటాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గ్రామాలకు వచ్చే వ్యాపారులు క్వింటాల్ పల్లికి రూ.8 వేలకు పైచిలుకు చెల్లించి కొంటుంటే.. పరిగి మార్కెట్‌లో చాలా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం పరిగి మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.6500 కంటే తక్కువ చెల్లించారని మండిపడ్డారు. మార్కెట్‌లో 12 మంది ఖరీదుదారులుండగా ముగ్గురు వ్యాపారులే కొనుగోళ్లు చేస్తున్నారని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఖరీదుదారులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వ్యాపారులతో మార్కెట్ అధికారులు కుమ్మక్కవడంతో రైతులు నిండా మునుగుతున్నారని వాపోయారు. మద్దతు ధర ఇచ్చేంత వరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని భీష్మించారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రాస్తారోకో చేపట్టారు. మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నించారు. ఇతర మార్కెట్లలో ఎక్కువ ధరకు విక్రయాలు జరుగుతున్నాయని.. పరిగిలో మాత్రం తక్కువ ధరకు కొనుగోళ్లు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ఆయనను నిలదీశారు. ఈ క్రమంలో పోలీసులు రైతులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి మారిపోయింది. ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి రైతులను రోడ్డు పక్కకు నెట్టేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి రైతులకు నచ్చజెప్పి, మార్కెట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలతో వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి పరిగిలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు: ఆర్డీవో విజయకుమారి

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో విజయకుమారి హెచ్చరించారు. జీతాలు తీసుకుంటూ రైతుల సమస్యలు పరిష్కరించరా అని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డులోని వేబ్రిడ్జిని పనిచేసేలా చూడాలని సూచించారు. కమీషన్ 2 శాతం కంటే అధికంగా వసూలు చేసిన వారిపై తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆదివారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పరిగికి వస్తానని, రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్టు తెలిపారు.

గత వారం కంటే తక్కువ ధర

పరిగి మార్కెట్‌కు ఈ రోజు 60 బస్తాల పల్లి తీసుకొచ్చిన. పోయిన వారం క్వింటాల్ రూ.7,400 వరకు కొనగా, ఈ రోజు చాలా తక్కువ ధరకు అడుగుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేటై ధర తగ్గించినా అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు మద్దతు ధర చెల్లించి న్యాయం చేయాలి.

– తావుర్యనాయక్, రైతు, ఏర్పుమళ్ల

రైతులకు తీరని అన్యాయం



పరిగి మార్కెట్‌లో రైతులను వ్యాపారులు మోసం చేస్తున్నా మార్కెట్ అధికారులు పట్టించుకోవడం లేదు. టెండర్లలో నాలుగైదు క్వాలిటీల పేరిట తక్కువ ధర ఇస్తున్నారు. టెండర్లలో చెప్పిన ధర కంటే చెల్లింపు సమయంలో రూ.వంద తగ్గించి ఇస్తారు. కమీషన్ 2 శాతం తీసుకోవాల్సి ఉండగా 5 శాతం కట్ చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే పట్టించుకోవడం లేదు. ఇతర ప్రాంతాల వ్యాపారులను ఇక్కడికి రాకుండా అడ్డుకుంటూ ముగ్గురు వ్యాపారులే మార్కెట్‌లో ఉత్పత్తులు కొంటున్నారు. కొనుగోలుకు రాని వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలి. –వద్యా శంకర్, మల్కాయ్‌పేట్ తండా, పరిగి, వికారాబాద్ జిల్లా

దిల్‌సుఖ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

‘అగ్రి’ వర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకోం

- ఎస్ఎఫ్ఐ నాయకుడు గుండె శివ

ఎల్బీనగర్, జనవరి 27: వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల భూముల జోలికి వస్తే ఊరుకొనేది లేదని రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి గుండె శివ హెచ్చరించారు. యూనివర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణానికి కేటాయించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో జీవవైవిధ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, యూనివర్సిటీ భూములనే హైకోర్టుకు కేటాయించడం సరికాదన్నారు. వెంటనే జీవో 55ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మీసాల స్టాలిన్, వేణు, చంటి పాల్గొన్నారు.

వియ్ వాంట్ జస్టిస్

కానిస్టేబుళ్లపై గవర్నర్‌కు ఏబీవీపీ ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై దాడి చేసిన మహిళా కానిస్టేబుల్ పైన చర్య తీసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు ఏబీవీపీ రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేసింది. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వినతిపత్రం అందజేసింది. జీవో 55ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, ఇతర విద్యార్థి నాయకులపై పోలీసులు అమానవీయంగా ప్రవర్తించారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఝాన్సీని లేడీ కానిస్టేబుళ్లు స్కూటీపై వెంబడించి జుట్టిపట్టి లాగి కిందపడేశారని తెలిపారు. ఆ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. గవర్నర్‌ను కలిసినవారిలో బాధితురాలితోపాటు ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీలు శ్రీనాథ్, పృథ్వీరాజ్, కల్యాణి తదితరులున్నారు.

మేడారం పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): మేడారం మహా జాతర పోస్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం సీఎం నివాసంలో ప్రముఖ సినీ నటుడు వెంకటేశ్, సినీ నిర్మాత సురేశ్‌బాబులు సీఎంను కలిసి అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన ప్రొఫెసర్ ఎం కోదండరాం, అమీర్‌అలీఖాన్ సీఎం రేవంత్‌రెడ్డిను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమను ఎమ్మెల్సీలుగా నియమించినందుకు వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తెలంగాణ మాసపత్రికను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, సీఎం సీపీఆర్వో అయోధ్యరెడ్డి, మాపత్రిక ఎడిటర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణపై 45 పేజీల రిమాండ్ రిపోర్టు

- 20 ఎల్ఐసీ బాండ్లు, 155 డాక్యుమెంట్ షీట్లు
- 120 ఖరీదైన వాచ్‌లు, 50 ఆస్తుల పత్రాలు
- హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు బినామీలు కూడా ఉన్నారు: ఏసీబీ

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో అరెస్టైన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ 45 పేజీల రిమాండ్ రిపోర్టులో ఏసీబీ అధికారులు కీలక అంశాలు వెల్లడించారు. బాలకృష్ణ ఇంటితోసహా 18 చోట్ల సోదాలు చేపట్టి, స్థిర, చరాస్తుల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బాలకృష్ణ ఇంట్లోని 50 స్థిర, చరాస్తుల డాక్యుమెంట్లు పరిశీలించగా.. వాటి ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.5 కోట్లుపైన ఉంటుందని, బహిరంగ మార్కెట్‌లో దానికి పది రెట్లు విలువ ఉంటుందని అంచనా వేశారు. వీటితో పాటు సోదాల్లో రూ.99 లక్షల నగదు, నాలుగు కార్లు, రూ.8.26 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.. రూ.32 లక్షల విలువైన టాగ్ హ్యూయర్, రోలెక్స్, రాడో, ఫాసిల్, టిస్సాట్ తదితర పలు బ్రాండ్లకు చెందిన 120 ఖరీదైన రిస్టు వాచీలు, ఆరు చోట్ల ప్లాట్లు గుర్తించినట్టు తెలిపారు. అన్ని సిరీస్‌లలో భారీగా ఐఫోన్లు, గృహోపకరణాలను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. వీటికితోడు 20 ఎల్ఐసీ పాలసీ బాండ్లు, రూ.58 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, 155 డాక్యుమెంట్ షీట్లు, 4 పాస్‌బుక్స్, ఐటీ రిటర్న్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. పలు ఇన్‌ఫ్రా కంపెనీల్లోనూ తాము సోదాలు చేసినట్టు తెలిపారు. ఈ సోదాల్లో బాలకృష్ణకు పలువురు బినామీలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. వారిని విచారించేందుకు కొంత సమయం కావాలని రిపోర్టులో తెలిపారు. ఈ అవినీతిలో ఇతర అధికారుల పాత్రపై దర్యాప్తు జరపాల్సి ఉన్నదని పేర్కొన్నారు. పీర్జాదిగూడలో పెంట రమాదేవి, మైహోం భూజాలో కిరణ్ ఆచార్య, జూబ్లీహిల్స్‌లో ప్రమోద్‌కుమార్, మాదాపూర్‌లో కొమ్మిడి సందీప్‌రెడ్డి, బాచుపల్లిలో సత్యనారాయణమూర్తి నివాసాలుసహా మొత్తం 18 చోట్ల సోదాలు చేసినట్టు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. 1994లో గ్రూప్-1 అధికారిగా సర్వీసులో చేరిన శివ బాలకృష్ణ.. 30 ఏండ్ల సర్వీసులో రూ.వందల కోట్ల ఆస్తులు సంపాదించారని ఏసీబీ అధికారులు గుర్తించారు.

పెండింగ్ చలాన్ల ఆదాయం 135 కోట్లు

- రాయితీ గడువు మళ్లీ పెంచబోం
- ఈ నెల 31 ఆఖరి తేదీ: పోలీసుశాఖ

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెండింగ్ చలాన్లపై ప్రభుత్వం ఇచ్చిన రాయితీ ఈ నెల 31తో ముగుస్తుందని, మరోసారి తేదీ పొడిగించే అవకాశం లేదని పోలీసుశాఖ స్పష్టంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3.59 కోట్ల పెండింగ్ చలాన్లకుగాను ఇప్పటివరకు 1,52,47,864 (42.38 శాతం) చలాన్లు చెల్లించారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.135 కోట్ల ఆదాయం వచ్చింది. వీటిల్లో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ.34 కోట్లు, సైబరాబాద్ పరిధిలో రూ.25 కోట్లు, రాచకొండ పరిధిలో రూ.16 కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబర్ 27 నుంచి పెండింగ్ చలాన్లు రాయితీతో చెల్లించేందుకు ప్రభుత్వం తొలుత 15 రోజులు అవకాశం కల్పించింది. సాంకేతిక సమస్యల కారణంగా మరోసారి జనవరి 31 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే.

ఏపీలో 31 నుంచి బీఈడీ కౌన్సెలింగ్

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో బీఈడీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 6 వరకు బీఈడీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. నిరుడు జూలై 14న ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలవగా, నెలలు గడిచినా కౌన్సెలింగ్ మాత్రం నిర్వహించలేదు. దీంతో బీఈడీ కళాశాలల యాజమాన్యాలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలో విచారించిన హైకోర్టు వెంటనే బీఈడీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలో 411 బీఈడీ కాలేజీలు ఉండగా, 34 వేలకు పైగా సీట్లు ఉన్నాయి.

కలెక్షన్ తగ్గిందని కండక్టర్‌పై యాక్షన్!

- ఆదాయం రావట్లేదని డ్యూటీ వేయని డీఎం
- మహాలక్ష్మి పథకం అమలుపై ఆర్టీసీలో గందరగోళం
- ఆందోళనలో సిబ్బంది

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీ సిబ్బంది ఉద్యోగాలకు ఎసరు తెస్తున్నది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని ఓ వైపు గొప్పలు చెప్పుకొంటూనే.. మరోవైపు ఆదాయం రావట్లేదంటూ కండక్టర్లపై ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవడం పట్ల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఫ్రీ టికెట్లు ఎక్కువగా ఎందుకు ఇష్యూ చేస్తున్నారని అధికారులు అడుగుతుండటంతో కండక్టర్లు గందరగోళానికి గురవుతున్నారు. నగరంలోని మియాపూర్-బాచుపల్లి- ఓఆర్ఆర్ 195 రూట్‌లో ఎక్కువగా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినులు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. దీంతో ఈ రూట్ బస్సుల్లో కలెక్షన్లు తగ్గాయి. ఈ నెల 24న మియాపూర్ డిపోకు చెందిన ఓ బస్సు కండక్టర్ 190 మంది ప్రయాణికులకు టికెట్లు జారీ చేశాడు. వీటిలో 140 ఫ్రీ టికెట్లు, 50 కలెక్షన్ టికెట్లు ఉన్నాయి. అయితే బస్సుల్లో ఫ్రీ టికెట్లు ఎక్కువగా ఎందుకు కొట్టావ్? కావాలనే ఫ్రీ టికెట్లు కొట్టి.. కలెక్షన్లు తక్కువ తెస్తున్నావంటూ సదరు డిపో మేనేజర్ కండక్టర్‌పై చర్యలు తీసుకున్నాడు. ఆ కండక్టర్‌కు మరుసటి రోజు డ్యూటీ ఇవ్వకుండా నిలిపివేశాడు. విషయం తెలుసుకుందామని శుక్రవారం వెళితే.. అధికారులెవరూ డ్యూటీలో లేరు. గతంలోనూ కలెక్షన్ తక్కువ తెస్తున్నారంటూ.. కండక్టర్ల పేరుతో డిపో, బస్టాండుల్లో ఫ్లెక్సీలు ప్రదర్శించారు. అప్పట్లో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ఆందోళనకు దిగడంతో ఫ్లెక్సీలను తీసివేశారు. ప్రభుత్వమే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తూ, ప్రయాణికుల చార్జీలను రీయింబర్స్‌మెంట్ చేస్తుంటే డిపోమేనేజర్లు డ్రైవర్లు, కండక్టర్లపై చర్యలు తీసుకోవడం పట్ల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్లలో కోర్టు భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జిలు టీ మాధవీదేవి, జే శ్రీనివాస్‌రావు

త్వరలో అన్ని జిల్లా కోర్టుల్లో ఈ-ఫైలింగ్

- న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలి
- సిరిసిల్లలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
- ప్రారంభోత్సవంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి టీ మాధవీదేవి

గాంధీ చౌక్, జనవరి 27: న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పని చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ టీ మాధవీదేవి ఆకాంక్షించారు. ఇప్పటికే జగిత్యాల కోర్టులో ఈ-ఫైలింగ్‌ను ప్రారంభించామని, త్వరలోనే అన్ని జిల్లా కోర్టుల్లోనూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. శనివారం సిరిసిల్ల జిల్లా కోర్టు సముదాయంలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు జడ్జి జే శ్రీనివాస్‌రావుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాధవీదేవి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి గొప్పదని, నిరంతర పఠనం, సీనియర్ అడ్వకేట్ల సలహాలు, సూచనలతో జూనియర్ అడ్వకేట్లు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఉన్నత న్యాయస్థానాల ప్రొసీడింగ్స్ లైవ్ స్ట్రీమింగ్‌ను డిజిటల్ ప్లాట్ ఫాం వేదికగా వీక్షిస్తూ తమను తాము సానబెట్టుకోవాలని తెలిపారు. హైకోర్టులో వర్చువల్ విధానం అందుబాటులో ఉందని, ముమ్ముందు అన్ని కోర్టుల్లో అమలు కానుందని చెప్పారు. హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి ఆరంభంలో కష్టాలు ఎదురైనా నిబద్ధతతో పని చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, జగిత్యాల జడ్జిలు ఎన్ ప్రేమలత, నీలిమ, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, సభ్యుడు ఆడెపు వేణు పాల్గొన్నారు.

పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లు

- రేపో మాపో నిర్ణయం ప్రకటించనున్న ప్రభుత్వం
- ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న సర్పంచ్‌ల పాలన

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలనకు రంగం సిద్ధమైంది. దీనిపై ఈ నెల 30న అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి ఒకటితో ప్రస్తుతమున్న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి సముఖంగా లేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులతో కాకుండా స్పెషల్ ఆఫీసర్లతో ప్రజా పాలన చేయాలని నిర్ణయించినట్టుగా సమాచారం. దాదాపు దశాబ్ద కాలం తరువాత తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లు రానున్నారు. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన అవసరం రాలేదు. స్పెషల్ ఆఫీసర్లుగా మండలంలో అందుబాటులో ఉండే ఎంపీడీవో, ఎంపీవో, తహసీల్దార్లు, గెజిటెడ్ హోదా ఉన్న ఇతర శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారు. ఆ మండలంలో ఉన్న పంచాయతీల సంఖ్య ఆధారంగా ఇతర శాఖల అధికారుల సేవలను వినియోగించుకుంటారు. ప్రస్తుతం చిన్న మండలాలు కావడంతో ఇతర శాఖల అధికారుల సేవలు తక్కువ సంఖ్యలో అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ దృష్టి పెట్టలేదు. బీసీ గణన చేస్తే కానీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేకపోవడంతో పీటముడి పడింది. బీసీ గణన చేసి వారికి రిజర్వేషన్లను ఖరారు చేసిన తరువాత ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

మళ్లీ సచివాలయ విధుల్లోకి 145 మంది

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): విభజన చట్టం అమలులో భాగంగా ఏపీకి వెళ్లి తిరిగివచ్చిన 145 మంది తెలంగాణ ఉద్యోగులు మళ్లీ సచివాలయంలో విధుల్లో చేరనున్నారు. వారిని సచివాలయంలోకి తీసుకొనేందుకు అంగీకరించిన సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా సదరు ఉద్యోగులు శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. మొత్తం 145 మంది కూడా క్లాస్ 3, 4 ఉద్యోగులేనని గతంలో 25 ఏండ్లు సచివాలయంలో పనిచేశామని, విభజన చట్టంలో భాగంగా 52:48 నిష్పత్తిలో ఏపీకి వెళ్ళామని వివరించారు. 2021లో తెలంగాణకు వచ్చినా.. ఇతర డిపార్ట్‌మెంట్లలో పనిచేశామని, దీనివల్ల సీనియారిటీ నష్టపోయామని, ఇన్ని రోజులు వేదనకు గురయ్యామని చెప్పారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాంకులను నిర్ణయించేది ఆ 8 ప్రశ్నలే!

- మధ్యస్థంగా జేఈఈ మెయిన్స్ ప్రశ్నపత్రం

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన పేపర్-1 (బీఈ/బీటెక్)లో వచ్చిన మొత్తం ప్రశ్నల్లో 8 ప్రశ్నలు చాలా కీలకం కానున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మొదటిరోజు పేపరులో ప్రశ్నలు మధ్యస్థంగా వచ్చినట్టు చెబుతున్నారు. 8 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చిన వారు కచ్చితంగా మొత్తంగా 300 మార్కులు తెచ్చుకునే వీలుందని తేల్చి చెప్పారు. పేపర్-1 పరీక్షలో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో విద్యార్థులకు అర్థమయ్యే ప్రశ్నలే అడిగారని, డిలీట్ చేసిన సిలబస్ నుంచి ప్రశ్నలు రాకుండా జాగ్రత్తపడ్డారని చెప్పారు. టాపర్లు 300కు 300 మార్కులు సాధించే అవకాశం ఉన్నట్టు శ్రీచైతన్య జూనియర్ కళాశాలల ఆలిండియా ఐఐటీ కోఆర్డినేటర్ ఉమాశంకర్ అభిప్రాయపడ్డారు. మొదటి షిఫ్ట్‌తో పోల్చితే రెండో షిఫ్టులో విద్యార్థులు సుదీర్ఘ సమయం తీసుకుంటారేమోనని తెలిపారు.

యశోద దవాఖానలో అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై

క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సు

యశోద దవాఖానలో ప్రారంభించిన గవర్నర్ తమిళిసై

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): వైద్య రంగంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, ఆధునిక చికిత్సా పద్ధతులు, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన సమాచారాన్ని పంచుకునేందుకు అంతర్జాతీయ వైద్య సదస్సులు వేదికగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై యశోద దవాఖానలో ఏర్పాటు చేసిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఈ సదస్సును నిర్వహిస్తున్న యశోద దవాఖాన యాజమాన్యాన్ని అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 85 కోట్ల మంది మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నారని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు క్రిటికల్ కేర్ నెఫ్రాలజీ చికిత్సా విధానాల గురించి విస్తృతంగా చర్చించేదుకు అంతర్జాతీయ వైద్య నిపుణులు ఉత్సాహంగా ముందుకు రావడం హర్షణీయమని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. వెయ్యి మందికిపైగా యువ ఇంటెన్సివిస్ట్‌లు, అనస్థీషియన్లు, సర్జన్లు, నెఫ్రాలజిస్టులు ఈ సదస్సుకు హాజరైనట్టు ‘యశోద’ సీనియర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ రాజశేఖర చక్రవర్తి తెలిపారు.

నకిలీ వీసాలిచ్చి గల్ఫ్ ఏజెంట్ మోసం

- జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో బాధితుల నిరసన
- మెట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు.. కేసు నమోదు

మెట్‌పల్లి, జనవరి 27: జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ నకిలీవీసాలు చేతిలో పెట్టి అమాయకులను నట్టేట ముంచాడు. ఎయిర్‌పోర్ట్ నుంచి నిరాశగా ఇంటిముఖం పట్టిన బాధితులు శనివారం ఏజెంట్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు. మెట్‌పల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఏలేటి రమేశ్ దుబాయిలో మల్టీనేషనల్ కంపెనీలో వాచ్‌మెన్, కార్పెంటర్, లేబర్ ఉద్యోగాలు ఉన్నాయని, నెలకు రూ.40 వేలు జీతం ఉందని, అందుకు ఒక్కో వీసాకు రూ.60 వేలు ఖర్చవుతుందని నమ్మించాడు. దీంతో నిర్మల్ జిల్లా ముథోల్, ఖానాపూర్, నిర్మల్, బోథ్, జగిత్యాల జిల్లా మల్లాపూర్, మెట్‌పల్లి మండలాలకు చెందిన సుమారు 63 మంది ఆశాజీవులు ఒక్కొక్కరు రూ.60 వేల చొప్పున అతనికి డబ్బులు ముట్టజెప్పారు. కొద్ది రోజుల కిందట వారికి వీసా ప్రతులను ఇచ్చాడు. వారిలో కొందరు ఈ నెల 24న దుబాయి వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడ ఇమిగ్రేషన్ అధికారులు ఆన్‌లైన్‌లో తనిఖీ చేయగా అవి నకిలీవి అని తేలడంతో వెనక్కి పంపించారు. ఇది తెలియని మరో ఇద్దరు ఈ నెల 25న దుబాయి వెళ్లేందుకు వీసా కాపీలతో అదే విమానాశ్రయానికి వెళ్లారు. అధికారుల తనిఖీల్లో అవి కూడా నకిలీవని తేలడంతో తిరిగి వెనకకు వచ్చారు. ఉపాధి కోసం దుబాయి వెళ్దామనకున్న బాధితులు.. ఏజెంట్ ఇచ్చిన వీసాలు నకిలీవని తేలడంతో ఆందోళన చెందుతున్నారు. మంచి కంపెనీ, మంచి జీతం అని చెప్పి మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని, తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గల్ఫ్ ఏజెంట్ ఏలేటి రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.

‘నకిలీ’ పాస్‌పోర్టులను రద్దు చేయండి!

- రీజినల్ అధికారికి సీఐడీ లేఖ

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పొందిన పాస్‌పోర్టులను వెంటనే రద్దు చేయాలంటూ రీజినల్ కార్యాలయ అధికారికి సీఐడీ లేఖ రాసింది. అలా పాస్‌పోర్టులు పొందిన 92 మంది వివరాలను సైతం అధికారులకు పంపినట్టు తెలిసింది. నకిలీ ధ్రువీకరణలతో పాస్‌పోర్టులు పొందినవారిలో కొందరు ఇప్పటికే విదేశాలకు వెళ్లగా, మిగతావారు దేశం దాటకుండా లుక్ అవుట్ నోటీసులు జారీచేసింది. ఈ విషయమై ఇప్పటికే విదేశాంగశాఖకు సమాచారం ఇచ్చి ఇంటర్ పోల్ సాయం కోరినట్టు సమాచారం. పాస్‌పోర్టు కోసం ఇచ్చిన ఫొటోలు, వేలిముద్రను మ్యాచ్ చేస్తూ మరింత సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. ఏఐ సాయంతో మెరుగుపరిచిన ఫొటోలను ఇంటర్‌పోల్‌కు పంపి ఆయా దేశాల్లో విచారణ జరిపించే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ ‘నకిలీ’ వ్యవహారం సంచలనం రేపడంతో వివరాలు బయట పడకుండా సీఐడీ జాగ్రత్తలు తీసుకుంటూ రహస్యంగా విచారణ కొనసాగిస్తున్నది.

ఒకే గ్రామానికి రెండు ‘పద్మాలు’

- బొల్లేపల్లికి అరుదైన గౌరవం
- గతంలో రావి నారాయణరెడ్డికి పద్మవిభూషణ్, తాజాగా సోంలాల్‌కు పద్మశ్రీ



పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రావి నారాయణరెడ్డి



పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోంలాల్ నాయక్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 27: యాదాద్రి జిల్లా భువనగిరి మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి దేశంలోనే అత్యంత అరుదైన గౌరవం లభించింది. పద్మవిభూషణ్, పద్మశ్రీ అవార్డులు అందుకున్న గ్రామంగా బొల్లేపల్లి చరిత్రకెక్కింది. బొల్లేపల్లికి ఒకప్పటి ఆవాస గ్రామమైన ఆకుతోటబావి తండా వాసి కేతావత్ సోంలాల్ నాయక్‌కు కేంద్ర ప్రభుత్వం తాజాగా పద్మశ్రీ అవార్డును ప్రకటించడంతో ఈ ఘనత సాధ్యమైంది. భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారా లిపిలోకి అనువదించినందుకు ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఇంతకుముందు బొల్లేపల్లి గ్రామానికే చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి 1992లో పద్మవిభూషణ్ అవార్డును అందుకున్నారు. దీంతో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు ముఖ్యులకు పద్మ అవార్డులు దక్కడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసిన నారాయణరెడ్డి.. నాటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. దీంతో అప్పటి పార్లమెంట్ భవనాన్ని నారాయరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం విశేషం.

సచివాలయ ఉద్యోగికి ఒకే రోజు రెండు ప్రమోషన్లు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): సచివాలయ ఉద్యోగికి ఒకే రోజు రెండు ప్రమోషన్లు దక్కాయి. ఆ రెండూ పూర్వపు తేదీలతో అమలుకానుండటం విశేషం. ఆర్థిక శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా పనిచేస్తున్న పీ ప్రవీణ్‌కుమార్‌కు 22న సెక్షన్ ఆఫీసర్‌గా, ఆ వెంటనే మరో జీవోతో అసిస్టెంట్ సెక్రటరీగా ప్రమోషన్లు ఇచ్చారు. మొదటి ప్రమోషన్ 2012 మే 29 నుంచి, రెండో ప్రమోషన్ 2017 జనవరి 6 నుంచి అమలులోకి వస్తుందని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

తెలంగాణ మాసపత్రిక ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మాసపత్రికను సీఎం రేవంత్ శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి, పొన్నం, ఉత్తమ్‌కుమార్, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ముఖ్యమంత్రి సీపీఆర్వో అయోధ్యరెడ్డి, మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి తదతరులు పాల్గొన్నారు.